క్లుప్తంగా

పరీక్షా ఫలితాల్లో నవోదయ విద్యాలయ రికార్డు

యానాం: 10వ, 12వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో యానాం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు సోమవారం తెలిపారు. 10వ తరగతిలో యు.సుహితా ఏంజెల్ 98.40 శాతంతో ప్రథమ, ఎస్ఎస్‌వీ సాయిప్రణీత్ 94.50 శాతంతో ద్వితీయ, వి.త్రినయ్ సాయిచరణ్ 94.30 శాతంతో తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో కె.విశాలాక్షి భవ్య 91.80 శాతం, ఆదిత్య రంజన్‌నాగ్ 91 శాతం, పి.ప్రశాంత్‌కుమార్ 90.60 శాతం మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో పరీక్ష రాసిన 34 మంది విద్యార్థులందరూ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. విద్యాలయ చరిత్రలోనే ఇది అత్యుత్తమ రికార్డు అని చెప్పారు. సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

సీఎం రంగసామికి పనసకాయల అందజేత



సీఎం రంగసామికి పనస కాయలను అందజేసిన ఎమ్మెల్యే కల్యాణసుందరం

యానాం: పుదుచ్చేరి రీజియన్ పరిధిలోని కాలపట్టు నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న శాసనసభ్యుడు కల్యాణ సుందరం సీఎం రంగసామికి సోమవారం పనసకాయలు అందజేశారు. కల్యాణసుందరం తన పొలంలో పనసతో పాటు అరటి, మామిడి తదితర ఉద్యానవన పంటలను పండిస్తున్నారు. అదే విధంగా అందమైన మొక్కలు, పుష్పాలతో కూడిన గార్డెన్‌ను ఆయన తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఆయన తన పొలంలో పండిన పండ్లను మిత్రులకు, సహచర శాసనసభ్యులకు ఏటా పంపిస్తుంటారు. తాజాగా సీఎం రంగసామికి అందజేశారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు తదితరులు

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వేంకటేశ్వర స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నిత్య హోమాలు, అర్చన, లక్ష్మీ హోమం, నీరాజన మంత్ర పుష్పం వంటి పూజలు జరిపారు. అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజ చేశారు. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఎండీలు రవికిరణ్ వర్మ, శశికిరణ్ వర్మ దంపతులు కల్యాణం జరిపించారు. మంగళవారం ఉదయం సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం తదితర కార్యక్రమాలు, స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

ఓపీఓ తీరుపై ఓటర్ల ఆగ్రహం


రావులపాలెం: ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాల్సిన ఎన్నికల విధుల్లో ఉండే పోలింగ్ అధికారులు ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించడంపై స్థానికులు మండిపడ్డారు. అధికారి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కేంద్రంలో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే రావులపాలెం మండలం ఊబలంక జెడ్పీ హైస్కూల్లో 64వ బూత్‌లో ఓపీఓగా విధులు నిర్వహించేందుకు వచ్చిన మలికిపురం మండలానికి చెందిన సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జి.రాజీవ్ సోమవారం జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లకు సిరాను వేలుపై పెట్టేందుకు విధులు నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో టేబుల్‌పై కూటమి పార్టీకి చెందిన యాడ్ ఉన్న ఒక ప్రముఖ పత్రికను (సాక్షి కాదు) కింద వేసుకుని సిర వేసే సమయంలో కూటమి పార్టీకి ఓటు వేయాలంటూ ఆ యాడ్‌ను చూపిస్తున్నాడని స్థానిక ఓటర్లు అభ్యంతర వ్యక్తం చేశారు. అతడితో వాగ్వాదానికి దిగడంతో కొంతసేపు ఆ కేంద్రంలో పోలింగ్ నిలిచిపోయింది. దీంతో రావులపాలెం తహసీల్దారు, పోలీస్ అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని ఓపీఓ రాజీవ్ అక్కడ నుంచి స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలింగ్ తిరిగి కొనసాగింది. అయితే ఎన్నికల సిబ్బంది ఈ విధంగా వ్యవహరించడంపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై రావులపాలెం తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మను వివరణ కోరగా గొడవ జరుగుతున్నట్లు సమాచార రావడంతో అక్కడికి చేరుకుని విచారించామన్నారు. అయితే ఈనాడు పత్రికలో వచ్చిన కూటమి పార్టీకి చెందిన యాడ్ ఉన్న పేపర్‌ను కింద వేసుకుని సిరాను పెట్టడంతో అతను ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించాడని స్థానికులు అభియోగించారన్నారు. దీంతో అక్కడ ఏ విధమైన గొడవలు జరగకుండా ఉండేలా పోలీస్ శాఖ వారు అతన్ని స్టేషన్‌కు తరలించారన్నారు. అయితే అతనిపై చర్యలు తీసుకునే అధికారం ఆ పోలింగ్ బూత్ పీఓకు ఉందని పీఓ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.



భట్నవెల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు



ఓటేసిన ఎస్పీ సుసరాపు శ్రీధర్



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అమలాపురం పట్టణం కొంకాపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు



ముమ్మిడివరంలో ఓటు హక్కు వినియోగించుకున్న పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఓటెత్తారు.. పోటెత్తారు..



ఎ.వేమవరప్పాడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



కేశనకుర్రులో బారులు తీరిన ఓటర్లు



గోడిలో బారులు తీసిన మహిళా ఓటర్లు



మొగళ్లమూరులో పోలింగ్ టైం ముగియడంతో ఓటర్లకు టోకెన్లు ఇస్తున్న పోలింగ్ అధికారి

- చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
- ఓటర్ల నిర్ణయం ఈవీఎంల్లో నిక్షిప్తం
- అమలాపురం నియోజకవర్గంలో 80 శాతానికి పైగా నమోదైన పోలింగ్

అమలాపురం టౌన్/అమలాపురం రూరల్/అల్లవరం/ఉప్పలగుప్తం: ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఆదివారం ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి మరీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండ కారణంగా ఉదయం పూట పెద్ద ఎత్తున ఓటింగ్ నమోదు కాగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకూ పోలింగ్ మందకొడిగా సాగింది. పోలింగ్ ముగిసే చివరి గంటలో ఒక్కసారిగా ఓటర్లు పోటెత్తడంతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. సాయంత్రం 6 గంటల తరువాత క్యూలైన్లలో ఉన్నవారందరికీ స్లిప్పులిచ్చి మరీ ఓటేసే అవకాశం కల్పించారు. ఓటర్ల నిర్ణయం ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. జూన్ 4వ తేదీన విజయ ఢంకా మోగించేదెవరో తేలనుంది. మొత్తంగా ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ పర్వం చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్నికలు సజావుగా జరిగాయి. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సాయుధ బలగాలు, పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

పెరిగిన పోలింగ్ శాతం

అమలాపురం నియోజవకర్గంలో 2019 ఎన్నికల్లో దాదాపు 74 శాతం మంది ఓటర్లు ఓటు వేశారు. ఈసారి గతంలో కంటే పోలింగ్ శాతం పెరిగి దాదాపు 80 శాతం పోలింగ్ నమోదైంది. తుది పోలింగ్ శాతంపై మంగళవారం ఉదయం నాటికి స్పష్టత వచ్చే అవకాశముంది. వేసవి ఎండల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈసారి ఎన్నికల సమయాన్ని పొడిగించింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరిగింది. ఇది కూడా పోలింగ్ శాతం పెరగడానికి ఒక కారణంగా కనిపిస్తుంది. ఈ సారి ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సోషల్ మీడియా వేదికగా చేసిన విస్తృత ప్రచారం కలిసొచ్చిందని భావిస్తున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన 4,210 మంది యువ ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చిచే ఈ ఎన్నికల్లో ఓటర్లలో చైతన్యం పెరిగిందన్నది వాస్తవం.

ఈవీఎంలు పనిచేయక తిప్పలు

అమలాపురం నియోజకవర్గంలో ఉదయం 7 గంటలకు పలు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ మొదలవ్వగానే ఈవీఎంలు మొరాయించాయి. అమలాపురం పట్టణం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలంలోని ఐదు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పనిచేయక పోలింగ్ కొద్ది ఆలస్యంగా ప్రారంభమైంది. ఓడలరేవులో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. సమనసలో కామనగరువు పితానివారిపాలెం బూత్ నెంబర్లు 74, 75ల్లో ఈవీఎంలు చాలా నెమ్మదిగా పనిచేస్తున్నాయంటూ ఓటర్లు గగ్గోలు పెట్టారు. అమలాపురం పట్టణం, అమలాపురం మండలం నడిపూడి, అల్లవరం మండలం కొమరిగిరిపట్నం, ఓడలరేవు, మొగళ్లమూరు గ్రామాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం ఆరు గంటల తర్వాత కూడా విద్యుత్ వెలుగుల్లో పోలింగ్ జరిగింది. అల్లవరం మండలం మొగళ్లమూరు, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, ఓడలరేవు శివారు మిలటరీ కాలనీ పోలింగ్ కేంద్రంలో సమయం ముగిసినా ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ అధికారి ఓటు వేయడానికి క్యూలో నిలబడిన ఓటర్లకు టోకెన్లు అందించారు. ఉప్పలగుప్తం మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ సుమారు గంట పాటు ఆలస్యం కావడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో ఎండ వేడిమికి ఉక్కిరిబిక్కిరయ్యారు. గొల్లవిల్లి పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్ కావాలని కోరినా అక్కడి అధికారులు నిర్లక్ష్యం వహించటంతో దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియను అమలాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ పోలింగ్ కేంద్రాలకు వచ్చి పరిశీలించారు. చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జగ్గిరాజుపేట పోలింగ్ కేంద్రం వద్ద రాత్రి 7 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. కాట్రేనికోన మండలం బలుసుతిప్ప, పల్లంలోని పోలింగ్ కేంద్రాల్లో ఆఖరి నిమిషంలో ఓటర్లు బారులు తీరడంతో రాత్రి 8 గంటలైనా పోలింగ్ కొనసాగింది.



చల్లపల్లి పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధురాలిని వీల్ చైర్‌పై తీసుకెళుతున్న దృశ్యం

ఓట్లు వేసిన ప్రముఖులు

నియోజకవర్గంలో మంత్రి పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు, ఆయన కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ దంపతులు అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అల్లవరం మండలం మొగళ్లమూరు పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీ చింతా అనురాధ ఓటు వేశారు. సాధారణ ఓటర్లతో కలిసి క్యూలో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోడిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఓటేశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలోని మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అమలాపురం పట్టణంలోని రాతిబడి పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గంటి హరీష్ మాధూర్ అమలాపురంలోని నల్ల వంతెన వద్ద గల పోలింగ్ కేంద్రంలో, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో ఓటు వేశారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పట్టణంలోని శ్రీనివాస మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఓటు వేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు శెట్టిబత్తుల రాజబాబు అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలో ఓటు వేశారు. బెండమూర్లంకలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఇందుపల్లిలో క్యూలో నిలుచున్న ఓటర్లు



అల్లవరంలో పోలింగ్ ముగిసే సమయంలో బారులు తీరిన ఓటర్లు



చినబొడ్డు వెంకటాయపాలెంలో ఓటు వేసిన శతాధిక వృద్ధురాలు



హోప్ ఐలాండ్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓటేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు

స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతం



కర్రివానిరేవులో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతి



మురమళ్లలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు



ముమ్మిడివరం మండలం గాడిలంకలో బారులు తీరిన ఓటర్లు

- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- బారులు తీరి ఓటేసిన ఓటర్లు

ముమ్మిడివరం/తాళ్లరేవు/ఐ.పోలవరం/కాట్రేనికోన/తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ముమ్మిడివరం మండలంలోని పెట్టావారి పేట 25వ పోలింగ్ బూత్‌లో, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని 16, 17 బూత్‌లు, అంబేడ్కర్ నగర్ పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయం నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి నియోజకవర్గంలో 74.61 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సరళి

ఈవీఎంలు మొరాయించడంతో ఉదయం పూట పోలింగ్ మందకొడిగా సాగింది. నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు 8.01 శాతం, 11 గంటలకు 25.99 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 41.99 శాతం, 3 గంటలకు 56.09 శాతం, సాయంత్రం 4 గంటలకు 61.27 శాతం, 5 గంటలకు 69.56 శాతం, 6 గంటలకు 74.61 శాతం ఓట్లు పోలయ్యాయి.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నీరజ దంపతులు ముమ్మిడివరం శివారు చిప్పలపాలెం బూత్ నెంబర్-16లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు మురమళ్లలో ఓటేశారు. అడిషనల్ ఎస్పీ కరణం కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాట్రేనికోన మండలం పల్లంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాల మధ్య జరిగిన పరస్పర దాడుల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వారిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అన్నంపల్లి, కొమానపల్లిల్లో మధ్యాహ్నం 1 గంటకు వర్షం వచ్చినా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాళ్లరేవు మండల పరిధిలోని పలు పంచాయతీల పరిధిలోని పోలింగ్ బూత్‌ల్లో ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించినా పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ కొంతసేపు ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్‌బూత్‌ల వద్ద బారులు తీరి కనిపించారు. అనేక పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తాగేందుకు తాగునీరు సైతం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని తోటపేటలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మండల పరిధిలో కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తాళ్లరేవు, కోరంగి, ఇంజరం తదితర పంచాయతీల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. కోరంగి పరిధిలోని బంగాళాఖాతంలో ఉన్న హోప్ ఐలాండ్‌లో అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. హోప్ ఐలాండ్‌లో 80 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామంలో 315 మంది ఓటర్లు ఉండగా 252 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



మురమళ్లలో ఓటు వేసి వస్తున్న శతాధిక వృద్ధురాలు